# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 02-04-2026 సమయం : సాయంకాలం 6గం.10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ అమరావతి చట్టబద్ధత బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలిపింది.
- ❖ పార్లమెంట్ లో అమరావతి బిల్లు ఏకగ్రీవంగా ఆమోదం పొందడంతో ఆంధ్రుల ఆకాంక్ష నెరవేరిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు.
- ❖ ప్రజా రాజధానిగా అమరావతి చరిత్రలో నిలిచిపోతుందని కేంద్రమంత్రి కె. రామ్మోహన్ నాయుడు అన్నారు.
- ❖ "ఐఎన్ఎస్ తారాగిరి" రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ సమక్షంలో విశాఖపట్టణం నేవల్ డాక్ యార్డ్ లో రేపు జల ప్రవేశం చేయనుంది.

====================

ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలిపింది. ఇప్పటికే నిన్న లోక్ సభ ఆమోదం తెలుపగా మూజువాణి ఓటుతో ఈ బిల్లుకు రాజ్యసభ కూడా ఈరోజు ఆమోదం తెలిపింది. అంతకుముందు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ ఈ బిల్లును ప్రవేశపెట్టగా ఛైర్మన్ సీ పీ రాధాకృష్ణన్ చర్చకు అనుమతించారు. మొత్తం 11 పార్టీలకు చెందిన 17 మంది సభ్యులు ఈ బిల్లుపై చర్చలో పాల్గొనగా.. 10 పార్టీలకు చెందిన ఎంపీలు బిల్లుకు అనుకూలంగా మద్దతిచ్చారు. బిల్లు ఆమోదం పొందిన సందర్భంగా రాజ్యసభ ఛైర్మన్ సీ పీ రాధాకృష్ణన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఇక రాష్ట్రపతి ఆమోదంతో అమరావతి బిల్లు చట్టంగా మారనుంది.

====================

పార్లమెంట్ లో అమరావతి బిల్లు ఆమోదంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సామాజిక మాధ్యమం వేదికగా హర్షం వ్యక్తం చేశారు. పార్లమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు-2026 ఏకగ్రీవంగా ఆమోదం పొందడం చారిత్రాత్మకమని.. దీంతో ఆంధ్రుల ఆకాంక్ష నెరవేరిందని, అమరావతికి లభించిన ఈ గౌరవం ప్రతీ ఆంధ్రుడికి గర్వకారణమన్నారు. అమరావతి చట్టబద్ధత బిల్లు పార్లమెంట్ ఆమోదానికి సహకరించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర

మోదీకి రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ ధన్యవాదాలు తెలిపారు. న్యూ ఢిల్లీలో పర్యటించిన మంత్రి నారా లోకేశ్ ఈరోజు ఎంపీలతో కలిసి నరేంద్ర మోదీని కలిశారు. అదే విధంగా కేంద్రమంత్రి కిరణ్ రిజుజుని కూడా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రాజ్యసభలో బిల్లుపై చేపట్టిన చర్చను పలువురు లోక్ సభ సభ్యులతో కలసి గ్యాలరీ నుండి వీక్షించారు. బిల్లు ఆమోదం తరువాత నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి లోకేశ్ మాట్లాడుతూ...

(వాయిస్28 సెకన్లు)

====================

ప్రజా రాజధానిగా అమరావతి చరిత్రలో నిలిచిపోతుందని కేంద్రమంత్రి కె. రామ్మోహన్ నాయుడు అన్నారు. రాజ్యసభలో అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుపై చేపట్టిన చర్చలో ఆయన ఈరోజు మాట్లాడుతూ... ఇవాళ చరిత్రాత్మకమైన రోజు అని, ఆంధ్రప్రదేశ్ రాజధాని గురించి ప్రజలకు స్పష్టత ఇస్తున్నామన్నారు. 2014లోనే అసెంబ్లీలో అమరావతిపై ఏకగ్రీవ తీర్మానం జరిగిందని చరిత్రలో ఏ రాజధాని చూసినా నదీ తీర ప్రాంతాల్లోనే విలసిల్లాయని చెప్పారు. కృష్ణా నది తీరంలో అమరావతి నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందని రామ్మోహన్ నాయుడు వివరిస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

అదే విధంగా భారతీయ జనతా పార్టీకి చెందిన పాకా సత్యనారాయణ మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ను అప్పటి కేంద్ర ప్రభుత్వం అస్పష్టంగా విభజించడం వల్లనే అనేక సమస్యలు ఉత్పన్నమయ్యాయని చెప్పారు. రాజధాని నిర్ణయించే అధికారం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనే ఉన్నప్పటికీ.. ప్రభుత్వాలు మారినప్పుడల్లా రాజధాని మారుస్తుండటం వల్లనే ఈ బిల్లుకు చట్టబద్ధత కల్పించాల్సివస్తోందన్నారు. ప్రజలు తమ ఆస్తులను ప్రభుత్వ అభ్యర్ధన మేరకు ఇచ్చినప్పుడు.. ఆ తరువాత ఎన్నికయ్యే ప్రభుత్వాలు వాటిని కొనసాగించకుండా ఆ ముందున్న ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాలను విస్మరిస్తే ప్రజల విశ్వాసాన్ని కోల్పోయే ప్రమాదముందని పేర్కొన్నారు. ఇక ఈ చర్చలో పాల్గొన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు వై వీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ... రాజధాని రైతుల గురించి ఈ బిల్లులో స్పష్టమైన హామీలు లేనందున తాము దీనిని వ్యతిరేకిస్తున్నామని చెబుతూ.. సభ నుంచి వాకౌట్ చేశారు.

విరామం

====================

ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో అత్యంత కీలకమైన 1,372 మీటర్ల పొడవైన `డయాఫ్రం వాల్` నిర్మాణం పూర్తయ్యింది. తక్కువ సమయంలో దీనిని పూర్తి చేసిన జలవనరుల శాఖ అధికారులకు, ఇంజనీర్లకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా అభినందనలు తెలియజేశారు. ప్రాజెక్టు నిర్మాణానికి సహకరించిన కేంద్ర సంస్థలకు, పోలవరం ప్రాజెక్టు అథారిటీ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా డయాఫ్రం వాల్ దెబ్బతినడంతో అదనంగా 1,000 కోట్ల రూపాయలు ఖర్చు చేయాల్సివచ్చిందన్నారు. ఇప్పుడు దీని నిర్మాణం పూర్తి కావటంతో ప్రధాన కట్టడమైన “ఎర్త్ కమ్ రాక్ ఫిల్” (ECRF) డ్యామ్ పనులు వేగవంతం అవుతాయన్నారు. ఇప్పటికే ప్రకటించినట్లు అన్ని పనులు పూర్తి చేసి.. 2027 గోదావరి పుష్కరాలకు ముందే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు

====================

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని జాతీయ స్థాయిలో ఉత్తమ పంచాయతీగా ఎంపికయ్యింది తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలంలోని బొక్కిసంపాలెం గ్రామం. మహిళా ఫ్రెండ్లీ విభాగంలో ఉత్తమ గ్రామ పంచాయతీగా జాతీయ పురస్కారాన్ని అందుకోవడంతో పాటూ.. కోటి రూపాయలు కేంద్ర ప్రభుత్వ అదనపు నిధులను కూడా ఈ గ్రామం దక్కించుకుంది. ఈ నేపథ్యంలో అభినందన సభను ఆ గ్రామంలో ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ... తమ గ్రామం ఈ పురస్కారానికి ఎంపిక కావడం ఆనందదాయకమన్నారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన కోటి రూపాయల నిధులతో మహిళా అభివృద్ధికి మరిన్ని కార్యక్రమాలు చేపట్టవచ్చన్నారు. పొదుపు సంఘాలు

అందిస్తున్న రుణాలను ఉపయోగించుకొని స్థానిక మహిళలు సాధికారత సాధిస్తున్నారని గ్రామ సర్పంచ్ రేఖ ఆకాశవాణికి తెలియజేస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

=====================

“ఐఎన్ఎస్ తారాగిరి” యుద్ధనౌక భారత నౌకాదళంలోకి రేపు జల ప్రవేశం చేయనుంది. `ఆత్మ నిర్భర్ భారత్` నినాదానికి అనుగుణంగా స్వదేశీ సాంకేతికతతో నిర్మితమైన ఈ నౌక రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ సమక్షంలో విశాఖపట్టణం నేవల్ డాక్ యార్డ్ వేదికగా భారత నావికాదళ అమ్ములపొదిలోకి చేరనుంది. 1980 నుంచి 2013 వరకూ 33 ఏళ్ల పాటు సేవలందించిన లీండర్–తరగతి ఫ్రిగేట్ అయిన పూర్వపు “ఐఎన్ఎస్ తారాగిరి” పేరుతోనే దీన్ని నిర్మించారు. అత్యాధునిక ప్రాజెక్ట్–17లో భాగంగా మల్టీ-మిషన్ స్టెల్త్ ఫ్రిగేట్‌గా రూపొందిన నీలగిరి శ్రేణికి చెందిన నాలుగో వార్‌షిప్ ఇది. దీనిని ముంబైలోని మజగాన్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ (ఎండీఎల్) నిర్మించింది. స్లీకర్ డిజైన్‌తో తయారైన ఈ నౌక రాడార్లకు చిక్కకుండా సముద్ర జలాల్లో వందశాతం నిర్దేశిత లక్ష్యాలను ఛేదించగలదు.

=====================

విశాఖ స్టీల్ ప్లాంట్‌కు చెందిన ఉద్యోగులు, రిటైర్డ్ సిబ్బంది ఎదుర్కొంటున్న సంక్షేమ సమస్యలు రోజు రోజుకు తీవ్రమవుతున్న నేపథ్యంలో వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానిక పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి శ్రీభరత్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామిని ఈరోజు ఢిల్లీలో కలిసి పరిస్థితి తీవ్రతను వివరించారు. స్టీల్ ప్లాంట్ కు చెందిన రిటైర్డ్ ఉద్యోగుల ఆరోగ్య బీమా చందాను ఒక్కసారిగా 2,600 నుంచి 17,000 రూపాయలకు పెంచే ప్రతిపాదనపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం సుమారు 10 వేల మంది రిటైర్డ్ ఉద్యోగులు, వారి కుటుంబాలతో కలిపి 20 వేల మందిపై భారీ ఆర్థిక భారం పడుతుందని కేంద్రమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. పరిశ్రమల్లో దశాబ్దాల పాటు ధూళి, వేడి, వాయువుల మధ్య పని చేసిన ఈ ఉద్యోగులు ప్రస్తుతం అనేక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారని గుర్తు చేశారు.

=====================
=====================